సాక్షి
ఖమ్మం
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



నగదు బదిలీ చేయండి

గొల్ల, కుర్మలకు గొర్రెలకు బదులు నగదు బదిలీ అమలుచేయాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. 8లో



'కోణార్క్'లో గంజాయి స్వాధీనం

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్, జీఆర్పీ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

శనివారం జిల్లాలో ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం త్వరగా పలుచోట్ల ఉష్ణోగ్రత పెరిగే అకాశముంది.

న్యూస్‌రీల్

రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోంది..



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సరిత

వైరా: రైతులకు సంబంధించి రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోందని, అర్హులైన ప్రతీఒక్కరికి లబ్ధి చేకూరుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.సరిత వెల్లడించారు. వైరా మండలం గరికపాడులో శుక్రవారం పర్యటించిన ఆమె పత్తి, మిర్చి, వరి పంటలను పరిశీలించారు. పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న తీరుపై ఉద్యోగులతో సమీక్షించారు. అలాగే, మిరపలో జెమినీ వైరస్, గుబ్బరోగం, పత్తిలో పచ్చదోమ, తెల్లదోమ, లద్దె పురుగు, పచ్చపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆతర్వాత సొసైటీ కార్యాలయంలో యూరియా నిల్వలను పరిశీలించిన డీఏఓ మాట్లాడుతూ జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని తెలిపారు. అలాగే, అగ్రహారం ఏపీజీవీబీ, డీసీసీబీ వైరా బ్రాంచ్‌ల్లో రుణమాఫీ పూర్తయిన రైతుల వివరాలపై డీఏఓ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పవన్‌కుమార్, ఏఈఓ వెంకటనరసయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి, పక్కన ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి సుబ్బారావు

ఖమ్మం వైద్యవిభాగం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించడమే కాక వైద్యపరీక్షల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ బి.మాలతి ఉద్యోగులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం అసంక్రమణ వ్యాధుల మూడో రౌండ్ స్క్రీనింగ్ యాప్‌లో వివరాల నమోదుపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ లక్ష్యాలను సాధించాలని, వ్యాక్సినేషన్‌లో వేగం పెంచాలని సూచించారు. అనంతరం అసంక్రమణ వ్యాధుల ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వి.సుబ్బారావు మాట్లాడుతూ కొత్త యాప్‌లో వివరాల నమోదుపై అవగాహన పెంచుకోవాలని, ప్రతీఒక్కరి పేర ఆయుష్మాన్ భవ హెల్త్ అకౌంట్(అభా) కార్డు తెరిచి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం డాక్టర్ నిఖిల్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ అధికారులు సైదులు, ప్రమీల, డెమో జి.సాంబశివరెడ్డి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్లు సత్యనారాయణ, మురళి పాల్గొన్నారు.

జేఎల్ పరీక్షకు 12 మంది దూరం

సత్తుపల్లి: జూనియర్ లెక్చరర్ల నియామకానికి టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్షకు నిర్ణీత సమయం దాటాక ఐదు నిమిషాల వరకే అనుమతిస్తామని అధికారులు ముందుగానే ప్రకటించారు. కానీ వివిధ కారణాలతో గురు, శుక్రవారం ఆలస్యంగా వచ్చిన 12 మందిని అనుమతించలేదు. సత్తుపల్లి మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా, గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. తెలుగు లెక్చరర్ల పరీక్ష గురువారం జరగగా ఆలస్యంగా వచ్చిన ఎనిమిది మందిని అనుమతించలేదు. ఇక శుక్రవారం ఫిజిక్స్, జువాలజీ లెక్చరర్ పరీక్షలకు 420మందిలో 172 మంది గైర్హాజరు కాగా, ఆలస్యంగా వచ్చిన నలుగురికి వెనక్కి పంపించారు. అయితే, దూరప్రాంతాల నుంచి వస్తుండడంతో కొద్దినిమిషాల ఆలస్యమైనా నిరాకరించడంపై అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు చలసాని హరికృష్ణ, శేషారత్నకుమారి పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.


పిండిప్రోలు కళాశాలలో డీఐఈఓ తనిఖీ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ రవిబాబు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధన, ఎంసెట్, నీట్, ఐఐటీ శిక్షణ తరగతులపై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో సమీక్షించారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడంతో పాటు మెరుగైన బోధన సాగించాలని సూచించారు.

హస్తినలో ఆశావహులు

ఢిల్లీలో 'హస్తం' అభ్యర్థుల టికెట్ కసరత్తు

- ఇప్పటికే మధిర, భద్రాచలం క్లియర్
- కాంగ్రెస్ తొలి జాబితాలోనే తుమ్మల, పొంగులేటికి స్థానం?
- మిగతా ఆరు స్థానాల్లో పోటాపోటీ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు హస్తిన బాట పట్టారు. అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీ స్క్రీనింగ్ కమిటీ ఢిల్లీలో కసరత్తు చేస్తోంది. ఈనెలాఖరులోగా తొలి జాబితా.. వచ్చేనెల రెండో వారానికల్లా అభ్యర్థుల ప్రకటన పూర్తవుతుందనే ప్రచారంతో తమ పేరు ఉండేలా చూసుకునేందుకు నేతలు పాట్లు పడుతున్నారు. పది నియోజకవర్గాలకు గాను రెండు చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలను స్క్రీనింగ్ కమిటీ ఖరారు చేసింది. ఇక మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు కూడా తొలి జాబితాలో ఉండే అవకాశముందని సమాచారం. మిగతా స్థానాల్లో ఒక్కరిద్దరి అభ్యర్థులను సూచిస్తూ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ.. సెంట్రల్ ఎన్నికల కమిటీ(సీఈసీ)కి పంపించగా... పరిశీలనలో నిమగ్నమయ్యారు.

120 దరఖాస్తులు

టీపీసీసీ సూచన మేరకు ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 120 మంది టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ఇల్లెందు నుంచి 32 మంది దరఖాస్తు చేసుకోగా, పినపాక నుంచి 17 మంది, వైరా నుంచి 15 మంది, పాలేరు నుంచి 14 మంది, సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి పది మంది చొప్పున, ఖమ్మం నుంచి తొమ్మిది మంది, అశ్వారావుపేట నుంచి ఎనిమిది మంది, భద్రాచలం నుంచి ముగ్గురు, మధిర నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇల్లెందు, వైరా, పినపాక వంటి నియోజకవర్గాల్లోనే పోటీ ఎక్కువగా ఉంది.

మిగతా వారిపై ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో నలుగురు ముఖ్య నేతల పేర్లు ఖరారైన నేపథ్యాన మిగిలిన ఆరుగురు అభ్యర్థులపై ఉత్కంఠ నెలకొంది. రిజర్వ్‌డ్ స్థానాలైన ఇల్లెందు, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లో ఎక్కువ మంది ఆశావహులు ఉండడం, టికెట్ కోసం అందరూ తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. అయితే, గతంలో సునీల్ కనుగోలు చేసిన సర్వేలు, ఇతర అంశాల ప్రాతిపదికన టికెట్ల కేటాయింపు ఉంటుందని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అభ్యర్థిని ప్రకటించడమే కాక టికెట్ రాని వారికి నచ్చచెప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఎవరికి వారే ప్రయత్నాలు..

ఆశావహులు పలువురు నేతలను కలుస్తూ తమకు టికెట్ వచ్చేలా చూడాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. స్క్రీనింగ్ కమిటీ భేటీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొననుండగా వారిని సైతం కలిసి విన్నవించుకున్నారు. మరోపక్క కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా తమ అనుచరుల అర్హతలు, వారికి టికెట్ ఇస్తే గెలిపించుకునే బాధ్యత తీసుకుంటామని చెబుతూ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

ముగిసిన వడబోత

టికెట్ కోసం అందిన దరఖాస్తులను తొలుత పీఈసీ(ప్రదేశ్ ఎన్నికల కమిటీ) వడపోసి ఒకటి, రెండు దరఖాస్తులు వచ్చిన చోట, పోటీ లేని స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. మిగిలిన చోట్ల ఒకటి నుంచి మూడులోపు పేర్లతో జాబితాను స్క్రీనింగ్ కమిటీకి అందించింది. ఈ కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశం కాగా.. ప్రస్తుతం ఢిల్లీలో భేటీ జరుగుతోంది. దీంతో టికెట్లు ఆశిస్తున్న వారు సైతం అక్కడకు చేరుకుని తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

తొలి జాబితాలోనే ముఖ్యులు

కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను ఈ నెలాఖరులో విడుదల చేయాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలోనే మధిర నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, భద్రాచలం నుంచి భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అభ్యర్థిత్వాలు సీఈసీలోనే ఖరారైనట్లు తెలిసింది. ఇక ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ బాధ్యులతో మాజీ ఎంపీ పొంగులేటి భేటీ అయ్యారు. ఆయన ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం స్థానాలకు దరఖాస్తు చేసుకోగా, తొలి జాబితాలోనే ఆయన పేరు ప్రకటించనున్నట్లు సమాచారం. అలాగే, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరు సైతం ప్రకటించనున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలకు గాను భట్టి, పొదెంతోపాటు తుమ్మల, పొంగులేటి పేర్లు తొలి జాబితాలోనే ఉంటాయని సమాచారం. అయితే, పొంగులేటి, తుమ్మలను ఏ స్థానాల నుంచి బరిలోకి దింపుతారనే అంశంపై చర్చ జోరుగా సాగుతోంది.

పేదలకు ప్రభుత్వ స్థలాలపై హక్కులు



ఇంటి పట్టాలు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్‌సురభి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు తదితరులు

- నివాసముంటున్న వారికి పట్టాలు ఇచ్చిన ఘనత మాదే
- సీఎం కేసీఆర్ మళ్లీ గెలిస్తేనే సంక్షేమ పథకాలు
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు వారి ఆధీనంలోని స్థలంపై హక్కులు కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చిన ఆలోచనతోనే జీఓ 58 ద్వారా పట్టాల పంపిణీ కొనసాగుతోందని తెలిపారు. అలాగే, ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే స్థోమత లేని వారికి గృహలక్ష్మి పథకం అమలుచేస్తున్నామని చెప్పారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన 398 మందికి జీఓ 58 ద్వారా పట్టాలు, గృహలక్ష్మి పథకం ద్వారా 230 మంది లబ్ధిదారులకు ఉత్వర్వులు కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదల ఆందోళనలను తొలగించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం హక్కు పత్రాలను ఇస్తుందని తెలిపారు. మొదటి విడతగా 3,253 మందికి పట్టాలు అందజేయగా, ఇప్పటికే 2 వేల మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించామని చెప్పారు. కాగా, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం గెలిస్తేనే సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని పువ్వాడ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పువ్వాడ ఖమ్మం 52వ డివిజన్‌లోని ఎన్ఎస్‌టీ రోడ్డులో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అడ్తీదారులకు లైసెన్సులు పంపిణీ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా ఎంపిక చేసిన అడ్తీదారులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లైసెన్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వైస్ చైర్మన్ అఫ్జల్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు సోమ నర్సింహారావు, మన్నెం కృష్ణ, దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్‌కుమార్, సారిక పాపారావు, బండి సతీష్, సాదె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నగరాలకు దీటుగా అభివృద్ధి

రఘునాథపాలెం: నగరాలకు దీటుగా రఘునాథపాలెం మండలంలోని ప్రతీ గ్రామాన్ని తీర్చిదిద్దుతున్నామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని చెరువుకొమ్ము తండా, పువ్వాడనగర్ గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు పంచాయతీ కార్యాలయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తండాలను పంచాయతీలుగా మార్చిన నేపథ్యాన అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నామని చెప్పారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్లు నిర్మించామని తెలిపారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, జెడ్పీటీసీ ప్రియాంక, అధికారులు, ప్రజాప్రజాప్రతినిధులు కే.వీ.కే.శ్రీనివాస్, విల్సన్, రామకృష్ణ, బానోత్ మంగమ్మదేవేందర్, కంపాటి లలితరవి, గుత్తా రవి, అజ్మీరా వీరునాయక్ కుర్రా భాస్కరరావు, మద్దినేని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేంజర్‌పై ఫ్లయింగ్ స్క్వాడ్ విచారణ

వరంగల్ సీసీఎఫ్‌కు ఫిర్యాదుతో రంగంలోకి..



అటవీ శాఖ గెస్ట్‌హౌస్‌లో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్

సత్తుపల్లి: సత్తుపల్లి అటవీశాఖ రేంజర్‌గా ఆరేళ్లు విధులు నిర్వర్తించి భద్రాద్రి జిల్లా అచ్యుతాపురం నర్సరీకి బదిలీపై వెళ్లిన ఎ.వెంకటేశ్వర్లుపై విచారణ కొనసాగుతోంది. సత్తుపల్లి అర్బన్ పార్క్, చంద్రాయపాలెం ప్లాంటేషన్‌లో పనులతో పాటు ఇసుక రవాణా తదితర అంశాల్లో అక్రమాలకు పాల్పడిన ఆయన రూ.లక్షలు ఆర్జించినట్లు భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమానాయక్‌కు 15 అంశాలపై పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 20, 21వ తేదీలలో భద్రాద్రి జోన్ ఫ్లయింగ్ స్క్వాడ్ డిప్యూటీ చీఫ్ కన్జర్వేటర్ ఎం.నాగభూషణం, రేంజర్ సందీప్‌రెడ్డి, డీఆర్ఓ వెంకట్రావు సత్తుపల్లిలో విచారణ చేపట్టారు. ఈ నేపథ్యాన ఖమ్మం డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ శుక్రవారం సత్తుపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని అధికారులతో సమావేశమైన రికార్డులు తనిఖీ చేశారు. రేంజర్ వెంకటేశ్వర్లుపై వచ్చిన ఆరోపణలపై ఆయన స్పందిస్తూ సీసీఎఫ్‌కు అందిన ఫిర్యాదుతో ఫ్లయింగ్ స్క్వాడ్ విచారణ జరిపిందని తెలిపారు.

రూ.కోటితో అటవీ శిక్షణ భవనం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్ పార్కులో రూ.కోటి వ్యయంతో అటవీ శాఖ శిక్షణ భవనం నిర్మించనున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ వెల్లడించారు. సత్తుపల్లిలోని అటవీశాఖ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దూలపల్లి అటవీశాఖ శిక్షణ కళాశాల సిబ్బంది క్షేత్రస్థాయి అవగాహనకు వచ్చినప్పుడు ఇక్కడ అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందులో గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, బాసారం, నీలాద్రిలలో బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం అటవీశాఖ స్థలాన్ని మంజూరు చేయగా, సీతారామ ప్రాజెక్టుకు ఖమ్మం డివిజన్‌లో 400ఎకరాల అటవీ భూమి ఇచ్చామని వెల్లడించారు. కాగా, మండాలపాడు మందాకిని నర్సరీలో 30వేల మొక్కలను పెంచుతున్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఇక ఈ ప్రాంతంలోని కోతులను నల్లగొండలోని మంకీ రెస్క్యూ సెంటర్‌కు తరలిస్తామని చెప్పారు. ఈసమావేశంలో ఎఫ్‌డీఓ వి.మంజుల, రేంజర్లు స్నేహలత, కె.అరవింద్, వి.శ్రీహరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి, చింతకానిలో భారీ వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండగా, గురువారం రాత్రి నేలకొండపల్లి, చింతకాని మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈమేరకు శుక్రవారం జిల్లా వాతావరణ శాఖ అధికారులు వర్షపాతం వివరాలను వెల్లడించారు. నేలకొండపల్లి మండలంలో 6.52, చింతకాని మండలంలో 6.36 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా వైరా మండలంలో 4.46, కూసుమంచి మండలంలో 4.06, మధిర మండలంలో 3.64, ముదిగొండ మండలంలో 3.32, కొణిజర్ల మండలంలో 3.06 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక ఏన్కూరు, పెనుబల్లి, తిరుమలాయపాలెం, తల్లాడ, ఖమ్మం రూరల్, బోనకల్, రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్ మండలాల్లో కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వానలు మెట్ట పంటలతో పాటు పత్తి, మిర్చి పైర్లకు ప్రయోజనం కలిగిస్తుండగా, వరి, ఉద్యాన పంటలకు కూడా మేలు చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. కాగా, వానలతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం కలుగుతోంది.

కరెన్సీ మాలలతో గణపతికి అలంకరణ



రూ.35లక్షల కరెన్సీ నోట్ల అలంకరణలో లక్ష్మీగణపతి



రూ.30 లక్షల కరెన్సీ నోట్లతో ప్రసన్నగణపతి..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీకోదండ రామాలయంలో వాసవీ గణపతిని శుక్రవారం రూ.35 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో లక్ష్మీగణపతిగా అలంకరించారు. రూ.100, రూ.200, రూ.500 కరెన్సీ నోట్లతో దండలు, పూల ఆకారాలతో శోభాయమానంగా అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కాగా, శ్రీకృష్ణమందిరంలోని గణేష్ ఉత్సవాల నిర్వహణకు కొమ్మేపల్లి కాలనీకి చెందిన షేక్ సత్తార్ నగదు విరాళం అందజేశారు. ఇక పట్టణంలోని శ్రీప్రసన్న గణపతి క్షేత్రంలోని శ్రీగణేష్ ఉత్సవ కమిటీ బాధ్యులు గణనాథుడిని రూ.30 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఈకార్యక్రమాల్లో గుండు ఉమామహేశ్వరరావు, పోకూరి కృష్ణప్రసాద్, మందపాటి రవీందర్ రెడ్డి, బెల్లంకొండ రాము, గుంజా వెంకటేశ్వరరావు, కూసంపూడి శ్రీనివాసరావు, గాదిరెడ్డి రాంబాబు రెడ్డి, పి.నాగేశ్వరరావు, ఏకాదశిమూర్తి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు 30 వరకు గడువు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని డీఈఓ ఇ.సోమశేఖరశర్మ, ఎం.వెంకటేశ్వరాచారి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. వివరాల కోసం సమీప సెంటర్లలో కానీ కోఆర్డినేటర్(80084 03522)ను కానీ సంప్రదించాలని సూచించారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం



పాలేరు రిజర్వాయర్‌లో చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: మత్స్యకార కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తోందని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వం వంద శాతం రాయితీపై సమకూర్చిన చేపపిల్లలను శుక్రవారం ఆయన పాలేరు రిజర్వాయర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సహకారంతో మత్స్యకారులు మత్స్య సంపదను పెంపొందించి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ ఏడాది రిజర్వాయర్‌లో రూ.3.14 కోట్ల విలువైన 13.10లక్షల చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలోని 551 చెరువుల్లో చేపపిల్లలు, రొయ్యలు విడుదల చేయడం ద్వారా మత్స్యకారులకు రూ.143కోట్లకు పైగా ఆదాయాన్ని మత్స్యకారులు సాధించారన్నారు. ఈఏడాది 903 చెరువుల్లో 3.62 కోట్ల చేపపిల్లలు వదలాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి విజయ్‌కుమార్, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ యడవెల్లి మంగమ్మ, ఎంపీటీసీ శీలం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లను పరిశీలించిన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్

అల్లీపురంలో నూతన సబ్‌స్టేషన్‌కు చార్జ్



అల్లీపురంలో సబ్‌స్టేషన్‌కు చార్జ్ చేస్తున్న డైరెక్టర్ మోహన్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ పరిధిలోని పలు సబ్ స్టేషన్లను శుక్రవారం టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.మోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రూ.1.4 కోట్లతో ఖమ్మం అల్లీపురంలో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సాంకేతికంగా చార్జ్ చేసి పరిశీలించారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటుతో ఖమ్మంలోని ఖానాపురం, మమతరోడ్ సబ్ స్టేషన్లపై భారం తగ్గుతుందని, పలు ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని అధికారులు వివరించారు. అనంతరం ఖమ్మం మమత వైద్యశాల రోడ్డులోని సబ్ స్టేషన్‌ను కూడా డైరెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడారు.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్, డీఈలు బాబూరావు, నంబూరి రామారావు, హీరాలాల్, భద్రు పవార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమల్‌రాజు

ఖమ్మంవన్‌టౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన ఆయన మధిర అభ్యర్థిగా తనకు అవకాశంపై ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు.

వైరా మార్కెట్ పాలకవర్గం నియామకం




మోహన్‌రావు, చైర్మన్ భద్రరాజు, వైస్‌చైర్మన్

వైరా: వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పసుపులేటి మోహన్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు మార్కెటింగ్ శాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే, వైస్‌చైర్మన్‌గా తల్లాడకు చెందిన దూపాటి భద్రరాజును నియమించారు. వైరా మండలం గొల్లపూడికి చెందిన మోహన్‌రావు ఎమ్మెల్యే రాములునాయక్ అనుచరుడిగా కొనసాగుతూ ఆయన వెంట బీఆర్ఎస్‌లో చేరి పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే, ఆయన భార్య వినోద గొల్లపూడి పంచాయతీ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఇక వైస్‌చైర్మన్‌గా భద్రరాజు నియమితులు కావడం ఇది మూడోసారి కావడం విశేషం. ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్‌గా తమను నియమించిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు రాములునాయక్, సండ్ర వెంకటవీరయ్య, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఖేలో ఇండియా టోర్నీలో అథ్లెట్ల ప్రతిభ



అథ్లెట్లను అభినందిస్తున్న డీవైఎస్ఓ, తదితరులు

ఖమ్మంస్పోర్ట్స్: హనుమకొండలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా అథ్లెటిక్స్ టోర్నీలో ఖమ్మం అథ్లెట్లు ప్రతిభ కనబరిచారు. ఖమ్మంకు చెందిన పి.లిఖిత 200 మీటర్ల పరుగులో రజత పతకం, బి.వైశాలి లాంగ్‌జంప్‌లో స్వర్ణపతకం, 100 మీటర్ల పరుగులో రజత పతకం కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ శుక్రవారంఅభినందించారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: అండర్–16 బాలుర ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం – ఖమ్మం జట్లు తలపడగా కొత్తగూడెం జట్టు విజయం సాధించింది. ఈ జట్టులో సాయిసాకేత్ 23, నిరంజన్ 19 పరుగులు చేయగా, బి.నారాజ్ నాయక్ నాలుగు, షరీఫ్ మూడు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్‌లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ బాధ్యుడు ఎం.డీ.ఫారూఖ్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

దశాబ్ది సంపద వనాలు పరిశీలన



స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న డీఆర్‌డీఓ, తదితరులు

కల్లూరు/కల్లూరు రూరల్: కల్లూరుతో పాటు మండలంలోని గోకవరం, నారాయణపురం గ్రామాల్లో దశాబ్ది సంపద వనాలను డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందికి సచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ బి.రవికుమార్, ఈఓ సీహెచ్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	8,250	4,000
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,000	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి	7,150	5,000

– ఖమ్మం వ్యవసాయం

నగదు బదిలీ అమలు చేయండి...

- గొర్రెల యూనిట్ల కోసం చెల్లించిన డీడీలు తిరిగి ఇవ్వాలి
- కలెక్టరేట్ ఎదుట గొర్రెలు, మేకల పెంపకందారుల ధర్నా
- రెండు గంటల పాటు ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జామ్
- అదనపు కలెక్టర్ కారును సైతం అడ్డుకున్న వైనం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గొర్రెలు, మేకల పెంపకదారులు, నాయకులు, (ఇన్‌సెట్) కారు దిగి కలెక్టరేట్‌లోకి నడిచి వెళ్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



ఖమ్మంమయూరిసెంటర్: గొల్ల, కుర్మల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రకటించిన గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా నగదు బదిలీ అమలు చేయాలని, లబ్ధిదారులు డీడీల రూపంలో చెల్లించిన నగదు తిరిగి ఇచ్చేయాలని యాదవ, కురమ సంఘాలు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం భారీ సంఖ్యలో నాయకులు, పెంపకదారులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టరేట్ గేట్ ఎదుట బైఠాయించి రెండు గంటల పాటు ఆందోళన చేపట్టగా ఇరువైపులా ప్రధాన రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు, పశుసంవర్ధకశాఖ జేడీ మనోహర్ చేరుకుని సర్దిచెప్పినా వారు ససేమిరా అన్నారు. గొర్రెలకు బదులు నగదు పంపిణీ చేయడంతో పాటు డీడీలు తిరిగి అందజేస్తామని హామీ ఇచ్చేవరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. ఈ సమయాన కలెక్టరేట్ గేట్లు మూసేయడంతో కార్యాలయం నుంచి బయటకు వచ్చే, లోపలకు వెళ్లే వాహనాలు సైతం నిలిచిపోయాయి. ఇదే సమయాన కలెక్టరేట్ నుంచి బయటకు వెళ్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ కారును సైతం అడ్డుకోగా, ఆయన కారు వెనక్కి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో గేటు నుంచి లోపలకు నడిచి వెళ్లారు. ఇంకో అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ కారు, ఈవీఎంలతో వచ్చిన వాహనాలను సైతం అడ్డుకోగా గంట పాటు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, తుశాకుల లింగయ్య, కాసని ఐలయ్య, ఉడత రవీందర్, మేకల మల్లిబాబుయాదవ్, అల్లిక వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రి యాదవ్ మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకందారులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. రూ.కోట్లలో వాటా ధనం చెల్లించి నెలలు గడుస్తున్నందున నగదు బదిలీ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, అల్లిక నరసయ్య, హన్మంతరావు, మొర్రిమేకల కోటయ్య, మామిళ్ల వెంకటేశ్వర్లు, దొంతెబోయిన నాగేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాతో ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

నిమజ్జన ఏర్పాట్లపై పరిశీలన



మున్నేటి వద్ద పరిశీలిస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మున్నేటిలో ఈనెల 27న వినాయక నిమజ్జనం జరగనుంది. నగరంలో ఈ ఏడాది దాదాపు 1,200 వరకు ఉత్సవాలను ప్రతిష్ఠించినట్లు అంచనా. ఆయా విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్, నాయుడుపేట వైపు ఉన్న మున్నేటిలో నిమజ్జనం చేస్తారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈమేరకు శుక్రవారం స్తంభాద్రి ఉత్సవ సమితి బాధ్యులు నిమజ్జన ప్రదేశాలను పరిశీలించడంతో పాటు అధికారులు చర్చించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డితో పాటు గెంటాల విద్యాసాగర్, కన్నం ప్రసన్న కృష్ణ, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘తుమ్మల’ను పక్కన పెట్టడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి, పక్కన నాయకులు

- ఆయన ఆధ్వర్యంలోనే బలోపేతమైన బీఆర్ఎస్
- పార్టీకి వెయ్యి మంది రాజీనామా చేస్తున్నట్లు అనుచరుల ప్రకటన

ఖమ్మంరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చాలా పరిమితంగా ఉన్న బీఆర్ఎస్ తరఫున ఎంపీటీసీ, సర్పంచ్ మున్సిపాలిటీల్లో అభ్యర్థులను గెలిపించి జిల్లాలో బలోపేతం చేసిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అధిష్టానం పక్కన పెట్టడం గర్హనీయమని పలువురు పేర్కొన్నారు. ఈమేరకు తాము సైతం బీఆర్ఎస్‌ను వీడి తుమ్మల వెంట నడవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఖమ్మం రూరల్ మండలం బారుగూడెం పరిధిలో శ్రీ సిటీలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సాధు రమేష్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. తుమ్మల ఏ పార్టీలో ఉన్నా జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేశారని, ఇప్పుడు ఆయనను పార్టీ పట్టించుకోకపోవడంతో తాము తీవ్ర మనోవేదనకు గురై తుమ్మల బాటలోనే నడవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గత నాలుగున్నరేళ్లుగా ఎన్నో అవమానాలు ఎదురుకాగా, సొంత పార్టీ వారే కేసులు పెట్టించారని చెప్పారు. అయినా టికెట్ వస్తుందని ఆశించామని.. చివరకు అవమానం ఎదురైందన్నారు. కాగా, గత ఎన్నికల్లో తుమ్మలకు కొందరు వెన్నుపోటు పొడవడంతనే ఓడిపోయారని తెలిపారు. ప్రస్తుతం సుమారు వెయ్యి మంది వరకు బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తుండగా, త్వరలోనే గ్రామగ్రామం నుంచి రాజీనామాలు మొదలవుతాయని రమేష్‌రెడ్డి వెల్లడించారు. సీతారామ ప్రాజెక్ట్ ఫలాలు జిల్లా ప్రజలకు అందించేందుకే తుమ్మల వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున ఆయనను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రామసహాయం వెంకటరెడ్డి, జూకూరి గోపాల్‌రావు, బండి జగదీష్, జొన్నలగడ్డ రవికుమార్, జంగం భాస్కర్, శాఖమూరి రమేష్, రానేరు యాదగిరి, పల్లెర్ల పాండు, మద్ది మల్లారెడ్డి, తేజావత్ పంతులునాయక్, వెన్నపూసల సీతారాములు, షేట్రాంనాయక్, ఎం.ఉపేందర్, తోట వీరభద్రం, తేజావత్ ఎల్లయ్యానాయక్, బొల్లం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో సీట్ల భర్తీకి నేడు స్పాట్ కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి శనివారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్సీఓ కె.ప్రత్యూష తెలిపారు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల గురుకులాల్లో మిగిలిన సీట్లను అర్హులైన విద్యార్థులతో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని డాక్టర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. కాగా, ఐదో తరగతిలో బాలికలకు 40, బాలురకు 26, ఆరో తరగతిలో బాలికలకు 24, బాలురకు ఎనిమిది, ఏడో తరగతిలో బాలికలకు 23, బాలురకు ఒక సీటు, ఎనిమిదో తరగతిలో బాలికలకు 17, బాలురకు 13, తొమ్మిదో తరగతిలో బాలికలకు 13, బాలురకు 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మెడికల్ కళాశాల ఆవరణలో ఇష్టారాజ్యం

విచ్చలవిడిగా వచ్చివెళ్తున్న బయటి వ్యక్తులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఇటీవల ప్రారంభించగా, సరైన భద్రతా చర్యలు మాత్రం చేపట్టలేదు. పాత కలెక్టరేట్ భవనాన్ని కళాశాలకు కేటాయించగా గత నాలుగు రోజులుగా తరగతులు నిర్వహిస్తున్నారు. పాత కలెక్టరేట్‌లో తరగతులు నిర్వహిస్తుండగా, పక్కనే ఉన్న పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవనాన్ని బాలికల హాస్టల్‌కు కేటాయించారు. ఈక్రమంలో కలెక్టరేట్ ఆవరణలోని టీ స్టాల్‌కు బయటి వ్యక్తులు పెద్దసంఖ్యలో వచ్చి గంటల తరబడి మకాం వేస్తున్నారు. దీంతో తరగతి గదుల నుంచి హాస్టల్‌కు వెళ్లే క్రమాన విద్యార్థినులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈమేరకు సరైన రక్షణ చర్యలు లేకపోవడంపై తల్లిదండ్రులు పెదవి విరుస్తుండగా.. ఇకనైనా ప్రిన్సిపాల్ స్పందించాలని వారు కోరుతున్నారు.



కళాశాల నుండి హాస్టల్‌లోకి వెళ్తున్న విద్యార్థినులు



కళాశాల ఆవరణలో బయటి వ్యక్తుల వాహనాలు

పెనుబల్లి తహసీల్దార్‌గా ప్రతాప్



పెనుబల్లి: పెనుబల్లి తహసీల్దార్‌గా ప్రతాప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత పదిహేను రోజులుగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేందర్‌ను సత్తుపల్లి ఎన్నికల విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రతాప్ నియమించగా విధుల్లో చేరారు. కాగా, గత నెల రోజుల్లో ఇక్కడ ఇద్దరు మారగా, మూడో తహసీల్దార్‌గా ప్రతాప్ బాధ్యతలు చేపట్టారు.

మెరుగైన విద్య కోసం బీడీఎస్ఎఫ్ ఉద్యమం

ఖమ్మంరాపర్తినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ద్వారా మెరుగైన బోధన అందించే వరకు బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్(బీడీఎస్ఎఫ్) ఉద్యమం కొనసాగిస్తుందని చైర్మన్ ప్రభంజన్ యాదవ్ వెల్లడించారు. ఖమ్మంలో శుక్రవారం బీడీఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించగా విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ప్రభంజన్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు ఆశయాన్ని నీరుగార్చేలా అగ్రకుల పాలకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులందరికీ సౌకర్యాలు కల్పించిన మెరుగైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోపే వినయ్‌కుమార్ మాట్లాడుతూ దోపిడీ శక్తులను పసిగట్టి ఓటు హక్కు ద్వారా రాజకీయ ఆధిపత్యాన్ని కూల్చాలని పిలుపునిచ్చారు. బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల సాయికుమార్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో అశాస్త్రీయ అంశాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కాకి భాస్కర్, పర్వతాలు, పొడకంటి రాంబాబు, దండి వెంకట్, పొడకంటి సుందరయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

భార్యను వేధించిన కేసులో రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా

ఖమ్మంలీగల్: వరకట్నం కోసం భార్యను వేధించిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొబైల్ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఖమ్మం బుర్హాన్‌పురానికి చెందిన షహనాజ్‌బేగం అలియాస్ ఫాతిమాకు నెహ్రూనగర్‌కు చెందిన సయ్యద్ ఫర్వేజ్ అలియాస్ అబ్దుల్ హఫీజ్‌తో 2016లో వివాహం జరిగింది. పెళ్లి సమయాన 20 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.3 లక్షల నగదు, రూ.2 లక్షల విలువైన సామగ్రి ఇచ్చారు. అయినా మరింత కట్నం తీసుకురావాలని భార్యను వేధించసాగాడు. గతంలో ఫర్వేజ్‌కు వివాహం జరిగిన విడాకులు తీసుకున్నట్లు ఆలస్యంగా తెలుసుకున్న ఫాతిమా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఆమె భర్తతో పాటు మామ, మేనమామపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా మామ, మేనమామపై కేసు రుజువు కాలేదని కొట్టేయగా, ఫర్వేజ్‌కు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసును ప్రాసిక్యూషన్ తరఫున వి.నర్సయ్య వాదించగా.. కానిస్టేబుల్ సైదులు సహకరించారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తున్న 22.5 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఆర్పీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగిన కోణార్క్‌లో తనిఖీ చేయగా, ఓ బ్యాగ్‌లో తరలిస్తున్న రూ.2.5లక్షల విలువైన గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అయితే, గంజాయి తరలిస్తున్న వ్యక్తులు మాత్రం పట్టుబడలేదు. తనిఖీల్లో జీఆర్పీ సీఐ శ్రీనివాస్, ఎస్సై భాస్కర్‌రావు ఆర్పీఎఫ్ ఎస్సై త్రివేణి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై షేక్ ముబషీర్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ కరీం పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

సత్తుపల్లి: సత్తుపల్లికి చెందిన యువకుడు ఇనపనూరి ప్రశాంత్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

వింతదూడ జననం

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో రైతు మాలోతు భద్రుకు చెందిన గేదె శుక్రవారం వింత దూడకు జన్మనిచ్చింది. గేదె పురిటినొప్పులతో బాధపడుతుండగా, పశు సంవర్ధక శాఖ వైద్యుడు అనంతు హరీశ్ చేరుకుని పరిశీలించారు. ఈమేరకు అవలక్షణాలు కలిగి సుమారు 60 కేజీల బరువుతో చనిపోయిన దూడను అతికష్టంపై బయటకు తీశారు. దూడ ముందు కాళ్ల నుండి మిగతా భాగం వృద్ధి చెంది పొట్టలో 30 కేజీల నీరు చేరడంతో చనిపోయినట్లు గుర్తించారు. జన్యుపరమైన లోపాలతో ఇలా జరుగుతుందని డాక్టర్ హరీశ్ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడి, ఆభరణాలు చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఖానాపురం వద్ద ద్విచక్రవాహనం వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు చింతల రాజేష్‌పై దాడి చేసి గొలుసు, చేతి ఉంగరం లాక్కెళ్లిన నలుగురిపై ఖమ్మం అర్బన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. రోజు మాదిరిగానే ఈనెల 20 సాయంత్రం ఖానాపురంలోని గోశాల నుండి పాలు తీసుకుని వెళ్తున్న ఉపాధ్యాయుడు రాజేష్‌పై గుర్తు తెలియని నలుగురు దాడి చేశారు. ఆయనను చంపేస్తామని బెదిరించి గొలుసు, ఉంగరం లాక్కోగా, స్థానికులు రావడంతో పారిపోయారు. అనంతరం ఆరా తీయగా బల్లేపల్లికి చెందిన ప్రవీణ్‌తోపాటు మరో ముగ్గురు ఉన్నట్లు ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నాటుసారా విక్రేతకు రూ.లక్ష జరిమానా

వైరా: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించారు. వైరా ఎక్సైజ్ సీఐ వి.రమ్యారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ మండలం మల్సూరు తండాకు చెందిన బానోత్ లక్ష్మి గతంలో నాటుసారా విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయితే, ఆమె మళ్లీ సారా తయారుచేస్తుండగా శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తల్లాడ తహసీల్దార్ వి.రవికుమార్ ఎదుట హాజరుపర్చగా ఆయన రూ.లక్ష జరిమానా విధించగా లక్ష్మి చెల్లించిందని సీఐ తెలిపారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు

కల్లూరు రూరల్: మండలంలోని చిన్నకోరుకొండి, తాళ్లూరు, వెంకటాపురం, చిన్నకోరుకొండి, చెన్నూరు, దారుగాబంజరు, పేరువంచ గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నాటుసారా తయారుచేస్తున్న నలుగురిని గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది నాగరాజు, శ్రీను, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కారేపల్లి శివాలయంలో చోరీకి యత్నం

కారేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ విఘ్నేశ్వర విశ్వేశ్వర సీతారామాంజనేయ స్వామి(శివాలయం)లో గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. కారేపల్లి స్టేషన్ బజార్‌లో ఉన్న శివాలయంలో దుండగులు గురువారం అర్ధరాత్రి ప్రవేశించారు. ఈమేరకు హుండీని ఎత్తుకెళ్లడంతో పాటు రూ.లక్ష విలువైన ఉత్సవ విగ్రహాలను చోరీ చేయాలని యత్నించారు. కానీ గది తాళాలు పగులగొడుతుండగా అలికిడికి కుక్కలు మొరగడంతో వారు పారిపోయారు. ఈమేరకు శుక్రవారం ఉదయం స్థానికుల ద్వారా అందిన సమాచారంతో పాటు చోరీకి యత్నించినట్లు ఆనవాళ్లు కనిపించడంతో పూజారి గుండు రామచంద్రమూర్తి ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ రామారావు ఆలయంలో పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

దూషించిన వారిపై కేసు నమోదు

పెనుబల్లి: ఓ మహిళతో పాటు ఆమె కుమార్తెలను దూషించి దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదైంది. మండలంలోని ముత్తగూడెంకు చెందిన పగడాల సునీత, ఆమె ఇద్దరు కుమార్తెలను అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ తిరుమలశెట్టి రవి, ఆయన కుమార్తె యామిని దూషించి కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

దాబాలో ఫర్నీచర్ ధ్వంసం

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై మండలంలని జుజుల్‌రావుపేట సమీపాన ఉన్న ఓ దాబాలో శుక్రవారం కొందరు అలజడి సృష్టించారు. జుజుల్‌రావుపేటకే చెందిన పలువురు దాబాలోని సిబ్బందిపై దాడికి దిగటంతో పాటు అందులోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. భోజన పదార్థాలకు తర్వాత డబ్బు చెల్లిస్తామని చెప్పగా, దాబా యాజమాని అంగీకరించకపోవడంతో దాడి చేసినట్లు తెలిసింది. అయితే, ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

సత్తుపల్లి: కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. సత్తుపల్లి మండలం చెరుకుపల్లికి చెందిన తాటి పద్మ(36) ఈనెల 15వ తేదీన కడుపునొప్పి బాధతో పురుగుల మందు తాగింది. ఆమెకు ఖమ్మంలో చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతి చెందడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రెజర్‌బాంబ్ పేలి డీఆర్‌జీ జవాన్‌కు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ప్రెజర్ బాంబ్ పేలడంతో ఒక డీఆర్‌జీ జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మావోయిస్టు పార్టీ వారోత్సవాల నేపథ్యాన డీఆర్‌జీ బలగాలు విస్తృతంగా కూంబింగ్ చేస్తున్నాయి. శుక్రవారం బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో పోలీస్ బలగాలే లక్ష్యంగా భూమిలో అమర్చిన ప్రెజర్‌బాంబ్‌ను గమనించని డీఆర్‌జీ జవాన్ సన్ను హేమ్లా తొక్కడంతో అది పేలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను బీజాపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.